క్లుప్తంగా

బాలికల రక్షణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కొక్కెరంచ గ్రామంలో బాలికల రక్షణపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలికల సంరక్షణ అందరి బాధ్యత, మహిళల రక్షణకు నడుబిగిద్దాం, బాలికల చదువు భవితకు వెలుగు తదితర నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం 1098, మహిళల రక్షణ కోసం 181 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు శ్యామలమ్మ, లైసమ్మ, వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పత్తి సాగుపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

నందికొట్కూరు: పత్తి సాగుపై అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్ రైతులకు సూచించారు. గురువారం స్థానిక ఆత్మ భవనంలో కృషి విజ్ఞాన్ కేంద్రం ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి సాగులో సాలుకు సాలుకు మధ్య దూరం 90 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య రూరం 15 సెంటీమీటర్ల దూరం ఉండాలన్నారు. 60 రోజుల పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు రైతులకు అవగాహన అవసరమన్నారు. 150 రోజుల్లో పంట ఒకేసారి పక్వానికి వచ్చి పురుగు ఉధృతిని తప్పించుకోవడమే గాక, కూలీల కొరత అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు ధనలక్ష్మి, బాలరాజు, రవిగౌడ్, లక్ష్మీప్రియ, వ్యవసాయ అధికారులు ఏడీఏ విజయశేఖర్, ఏఓ షేక్షావలి, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ లాంచనాలతో అంత్యక్రియలు



పోలీస్ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ వేల్పుల రంగస్వామి ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గురువారం షుగర్ లెవల్స్ పడిపోయి మృతిచెందాడు. ఆయన మృతదేహానికి స్వగ్రామం తలముడిపిలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మిడుతూరు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, ఆళ్లగడ్డ ఎస్‌ఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం



ఉచిత మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్లు

మహానంది: బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లెలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ గౌసియా బేగమ్ పాల్గొని గొడ్డుమోతు, ఎదకు రాని పశువులకు పరీక్షలు నిర్వహించి వైద్యం చేశారు. పశువుల్లో సంక్రమించే వ్యాధులు, మేలైన యాజమాన్య పద్ధతుల గురించి పాడిరైతులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మహానందికి ఆషాడ మాసం ఎఫెక్ట్



భక్తుల సందడి లేక వెలవెలబోయిన ఆలయ ముందు భాగం

మహానంది: వరుస వర్షాలు, ఆషాడ మాసం కావడంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. నిత్యం భక్తులతో కళకళలాడే ఆలయ ప్రాంగణాలు భక్తుల రద్దీ లేక వెలవెలబోతున్నాయి.

తహసీల్దార్ సీటుకు భలే గిరాకీ

- ఆదాయ వనరుగా అసైన్డ్, ప్రభుత్వ భూములు
- ఎర్రమట్టి అక్రమ తవ్వకం దారుల నుంచీ ఆమ్యామ్యాల ఆశ



జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం

జూపాడుబంగ్లా: తహసీల్దార్ సీటుకు భలే డిమాండ్ ఏర్పడింది. ఎన్నికల విధుల్లో భాగంగా చిత్తూరు నుంచి ఇక్కడికి వచ్చిన తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్.. బదిలీపై సొంత జిల్లాకు వెళ్లడంతో ఈ స్థానం కోసం ఆరుగురు తహసీల్దార్లు పోటీపడుతున్నారు. విషయమేమిటా అని ఆరా తీయగా మండలంలో 14,500 ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. ఎక్కువగా పారుమంచాల, తంగడంచ, తూడిచెర్ల, పి.లింగాపురం, 80బన్నూరు, గ్రామాల పరిధిలోనే ఈ భూములున్నాయి. ఆయా గ్రామాల రైతులు వాటిని సాగు చేసుకుంటున్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల వాటిని ఇతర రైతులకు అమ్మటం, కొనటం చేస్తుంటారు. ఈ సమయంలో కాస్తో కూస్తో రెవెన్యూ అధికారులకు ముట్టజెబితేనే కొత్తగా కొనుగోలు చేసిన రైతు పేరుతో అధికారులు ఆన్‌లైన్ చేస్తారు. లేకపోతే రైతులను నానా ఇబ్బందులు పెడతారు. ఆ ఇబ్బందులు పడలేక కచ్చితంగా అడిగినంత ఇచ్చుకోకతప్పదు. ఈ కాసుల కోసమే పోటీ పెరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు మండల కేంద్రంలోనే ప్రభుత్వ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ ఎవ్వరి అధికారం ఉంటే వారు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవటం పరిపాటిగా మారింది. ఇదేమిటని ప్రశ్నించే రెవెన్యూ అధికారులు లేకపోగా.. నాయకులు చేతిలోపెట్టే కాసులకు దాసోహంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటారు. వీటన్నింటితోపాటు ఇటీవల జాతీయరహదారి నిర్మాణం పనుల నిమిత్తం కాంట్రాక్టర్లు ఎర్రమట్టి కోసం రైతుల భూములను కొనుగోలు చేసి ఎలాంటి అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. వీటిని కూడా చూసీచూడనట్లు వదిలేసేందుకు కూడా భారీగా ముడుపులు అందుతాయని, ఎంతలేదన్నా ఇక్కడి తహసీల్దార్‌కు నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉందని కార్యాలయ వర్గాల నుంచే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొందరు అధికారులు నాయకుల వద్ద పావులు కదుపుతున్నట్లు కిందిస్థాయి రెవెన్యూ అధికారులు చర్చించుకుంటున్నారు.

అధిక దిగుబడులే లక్ష్యం

- జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి హేమలత



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి హేమలత

కొత్తపల్లి: తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించమే పొలంబడి కార్యక్రమం లక్ష్యమని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత అన్నారు. గురువారం మండలంలోని పాలెంచెరువు గూడెంలో మండల వ్యవసాయాధికారి మహేష్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో రైతులకు మెలకువలు నేర్పారు. సేంద్రియ పద్ధతులు, కలుపునివారణ చర్యలు, విత్తనశుద్ధి ప్రయోజనాలు, తెగుల్ల నివారణ, దోమపోటు నివారణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాషా, సరస్వతి, గ్రామ వ్యవసాయ సహాయకుడు జహీద్ పాల్గొన్నారు.

ఎస్ఎన్ తండాలో ..



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని ఎస్ఎన్ తండాలో వరి సాగుపై వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందులు, రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించాలని ఆయన రైతులకు సూచించారు. సేంద్రియ వ్యావసాయ పద్ధతుల ద్వారా పండించే ఉత్పత్తులను ప్రభుత్వం సర్టిఫికెట్ ఇస్తుందని, తద్వారా ధర కూడా ఎక్కువగా వస్తుందని వివరించారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి గురువారం విశేష పూజలను నిర్వహించారు. అంతకు ముందు మహాగణపతి పూజను నిర్వహించారు. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

మిడుతూరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కిరణ్ సూచించారు. గురువారం స్థానిక సచివాలయంలో డెంగీ వ్యతిరేక మాసం పురస్కరించుకొని డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, సూపర్‌వైజర్లు ఏసేపు, రామతులశమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు మీన, మారెమ్మ, ఏఎన్ఎం జ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సరస్వతి

పాములపాడు: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంపీడీఓ సరస్వతి సూచించారు. గురువారం మండలంలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మండలంలోని వేంపెంట, బానకచెర్ల గ్రామాల సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమై ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. గ్రామాల్లోని పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని, ఎక్కడ కూడా పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

- ఏడీఏ ఆంజనేయ



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ సూచించారు. గురువారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సిబ్బందితో సమావేశం అయ్యారు. జాతీయ ఆహార భద్రతా మిషన్, పొలంబడి, పీఎం కిసాన్, కౌలు రైతు కార్డుల గురించి చర్చించారు. గ్రామాల వారీగా ఎన్ని కార్డులు కౌలు రైతులకు అందజేశారని ఆరా తీశారు. రైతులు సాంకేతిక విజ్ఞానంతో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, యంత్ర సేవా కేంద్ర సిబ్బంది, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని వేంపెంట ఆర్బీకేలో వరి సాగుపై మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంట ఉత్పత్తుల సంఘం సీఈఓ, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది సుల్తాన్, శంకర్, ఏఈఓ మద్దిలేటి పాల్గొన్నారు.

పండ్ల తోటలతో ఆర్థికాభివృద్ధి



వెలుగోడులో రైతులతో సమావేశం నిర్వహిస్తున్న ఏపీఓ మల్లికార్జున

వెలుగోడు: పండ్ల తోటలతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏపీఓ మల్లికార్జున సూచించారు. వెలుగోడు, బోయరేవుల, మోతుకూరు గ్రామాల్లో రైతులకు గురువారం రైతులకు అవగాహన కల్పించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పండ్లు, పూలమొక్కల పెంపకంపై చైతన్యవంతం చేశారు. మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సపోటా, కొబ్బరి, నేరేడు పండ్ల తోటల సాగు విధానం, ప్రభుత్వం అందించే సబ్సిడీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు కోసం ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తామన్నారు. 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులు పండ్ల తోటలు సాగుచేయవచ్చన్నారు. మామిడి, జీడీ మామిడి, బత్తాయి, నాటు జామ, సపోటా, సీతాఫలం, దానిమ్మ, నేరేడు తదితర పండ్ల తోటల సాగుకు ఉపాధి నిధులు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

వెలుగోడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న నలుగురు ఉద్యోగాలకు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుంతకందాల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నాగార్జున, రేగడగూడురులో లింగన్న, అబ్దుల్లాపురంలో సురేష్, మోతుకూరులో నవీన్ కుమార్‌రెడ్డిలు రాజీనామా చేసి ఎంపీడీఓకు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పేర్కొన్నారు.

మొబైల్ ఆధార్ క్యాంపులు

మండలంలోని అన్ని గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు కొనసాగుతున్నాయని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆధార్‌కార్డు లేనివారు, మార్పులు, చేర్పులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

అలరించిన భజన



భజన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద బనగానపల్లెకు చెందిన వీరాంజనేయ భజన మండలి వారి భజన కార్యక్రమం ఆకట్టుకుంది. ఈశా..మహేశా, కై లాసవాస, శంకరా పార్వతీ పరమేశ్వరా, ఓంకార రూపా, శ్రీశైలవాసా శ్రీమల్లికార్జున, గంగా తరంగ, శ్రీగౌరిపార్వతీ మొదలైన భక్తి గీతాలు, అష్టకాలను బీవీ సూర్యనారాయణరెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, బి.లక్ష్మీనారాయణరెడ్డి, డి. సీతారామిరెడ్డి, ఎం.రామకృష్ణ, బి.శివయ్య, మధుకుమార్, మహేశ్వరరెడ్డి, పద్మావతమ్మ, లక్ష్మీదేవి, తదితరులు ఆలపించారు

ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారిణి స్వాతి

మహానంది: ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు చేసే ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని బండిఆత్మకూరు మండల వ్యవసాయ అధికారిణి స్వాతి సూచించారు. బండిఆత్మకూరు మండలంలోని ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్‌బోర్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలన్నారు. అనుమతుల్లేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో మొహర్రం వేడుకల సందర్భంగా బాణాసంచా పేల్చే సమయంలో జరిగిన ఘర్షణలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. గురువారం గ్రామానికి చేరుకొని ఇవరు వర్గాలను కలిసి వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట ఏఎస్ఐ సుబ్బయ్య ఉన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

కొత్తపల్లి: మండల పరిధిలోని శివపురం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శేఖర్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. 20 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బుధవారం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లేకపోవడంతో విద్యార్థిని తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహానందిలో మళ్లీ కనిపించిన చిరుత

మహానంది: మహానందిలో చిరుత సంచారంతో భక్తులు, స్థానికులు భయాందోళనకు గురవుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఈశ్వర్ నగర్ కాలనీకి చెందిన చెంచు యువకుడు నాగన్నపై దాడి చేసి గాయపర్చిన ప్రదేశంలోనే గురువారం రాత్రి మరోసారి చిరుత సంచరించినట్లు స్థానికులు తెలిపారు. ఈశ్వర్ నగర్ కాలనీకి చెందిన యువకుడు నగేష్ బహిర్భూమికి వెళ్లగా చిరుత కనిపించినట్లు చెప్పాడు. కొద్దిరోజులుగా సంచారం లేని చిరుత మళ్లీ కనిపించడంతో భయం పట్టుకుంది.

భూసేకరణ పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, పరిశ్రమలు ఇతర భూసేకరణకు సంబంధించి ప్రతిపాదనలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ పద్మజ, ఆర్డీఓలు మల్లికార్జున రెడ్డి, ఎం.దాసు, మహేశ్వర్ రెడ్డిలు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, నేషనల్ హైవే పీడీ గోవర్ధన్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 340సి ప్యాకేజీ 4 కింద జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు మండలాలు మీదుగా వెళ్లే రహదారి భూసేకరణకు సంబంధించి 75.47 ఎకరాలు పెండింగ్‌లో ఉందని, ఇందుకు సంబంధించి తహసీల్దార్ల నుంచి క్లెయిమ్స్ తెప్పించుకొని పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని ఆర్డీఓలకు సూచించారు. 167కె ఒకటవ ప్యాకేజీ కింద (నంద్యాల నుంచి జమ్మలమడుగు వరకు) నంద్యాల, గోస్పాడు, దొర్నిపాడు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, సంజామల మండలాల మీదుగా వెళ్లే రహదారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అవార్డ్స్‌ను త్వరితగతిన పాస్ చేయాల్సిందిగా నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. 167కె ప్యాకేజ్ 4 కింద 5 మండలాలు 22 గ్రామాలకు చెందిన 177 ఎకరాల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇందుకు సంబంధించి తహసీల్దార్ల నుంచి నివేదికలు తెప్పించుకొని సమర్పించాలన్నారు. 167కె ప్యాకేజీ – 5 కింద నల్లకాలువ నుంచి వెలుగోడు వరకు 3ఏ ప్రతిపాదనలను ఏపీఆర్‌డీసీ కార్య నిర్వహణ అధికారి నుంచి ప్రతిపాదనలు తెప్పించుకోవాలన్నారు. రోడ్లు భవనాలు సంబంధించి రహదారుల విస్తరణ, రైల్వే ప్రాజెక్టులు, సిమెంట్ పరిశ్రమలు, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చుక్కల భూములు, అన్యాక్రాంత భూములకు సంబంధించిన ప్రతిపాదనలు, నివేదికలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు విజేత వెంకటగిరి వృషభాలు



వెంకటగిరి వృషభాల యజమానికి నగదు బహుమతి అందిస్తున్న పుల్యాల చంద్రశేఖర్ రెడ్డి

కొత్తపల్లి: గోకవరం హుస్సేన్ సాహెబ్ దర్గా ఉరుసు సందర్భంగా గురువారం నిర్వహించిన ఒంగోలు జాతి వృషభాల రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన కృష్ణప్రసాద్ వృషభాలు విజేతలుగా నిలిచాయి. రెండో స్థానంలో అనంతపురం జిల్లా ఏ.నారాయణాపురం గ్రామానికి చెందిన వృషభాలు, మూడో స్థానంలో నందికొట్కూరు మండలం మల్యాల గ్రామానికి చెందిన షేక్ మైమున్నా, గోస్పాడు మండలం కలుగొట్ల గ్రామానికి రమేష్‌నాయుడుల వృషభాలు(సమానంగా), నాల్గవ స్థానంలో జోన్ మండలం కొత్తకోట వృషభాలు, ఐదవ స్థానంలో ప్రకాశం జిల్లా దర్శికి చెందిన గరిపాటి వెంకట్ వృషభాలు, ఆరవ స్థానంలో బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామానికి చెందిన చాగంటి నాగేశ్వరరెడ్డి వృషభాలు నిలిచాయి. విజేతల ఎడ్ల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.35,000, రూ.25,000, రూ.15,000, రూ.10,000, రూ.8,000, రూ.5,000 అందజేశారు. కార్యక్రమంలో గోకవరం సర్పంచు కలబండి మారెన్న, దాతలు పుల్యాల చంద్రశేఖర్‌రెడ్డి, చాకలి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ కనిపెట్టడంలో ప్రభుత్వం విఫలం

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పౌర హక్కుల సంఘం నేతలు



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

పగిడ్యాల: బాలిక మృతదేహం ఆచూకీని కనిపెట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి అల్లాబకాష్ అభిప్రాయపడ్డారు. గురువారం మండలంలోని కొత్త ఎల్లాలకు చేరుకుని బాలిక తల్లిదండ్రులను పరామర్శించి, ఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఘటన జరిగి 20 రోజులవుతున్నా బాలిక మృతదేహం ఆచూకీని పోలీసులు కనిపెట్టలేకపోవడం శోచనీయమన్నారు. ఆధునిక టెక్నాలజీతో ఎన్నో కేసులను ఛేదించే పోలీసులు.. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోందన్నారు. అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన నిందితులు ఎవరో తెలిసినా కేసును ఛేదించలేకపోవడం దారుణమన్నారు. ఈ కేసు వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. కనీసం ఎముకలైనా ఇప్పించాలని బాలిక తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారంటే.. వారి వేదన వర్ణణాతీతమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులోని నిందితుల్లో ఒకరు లాకప్ డెత్‌కు గురైనట్లు పత్రికల్లో చూశామని, ఆ బాధిత కుటుంబాన్ని కూడా పరామర్శిస్తామని వారు తెలిపారు. వారి వెంట పౌరహక్కుల సంఘం సభ్యులు కరీంబాషా న్యాయవాది ఇదాయతుల్లా, సుబ్బరాయుడు ఉన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులకు పథకాలు అమలు చేయాలి

పాములపాడు: రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ స్కూళ్లు, వసతి గృహాల్లో పనిచేస్తున్న ఆప్కాస్, డైలీ వేజ్ వార్డెన్లు, వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి, ఎంటీఎస్ అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్ ఆప్కాస్ కార్మికులతో మాట్లాడారు. వివిధ ప్రభుత్వ సంస్థల్లోని ఔట్‌సోర్సింగ్ కార్మికులు కనీస వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల ససమ్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు శ్యామలమ్మ, రూపాదేవి, గోవిందమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జార్తలు



మకానం ముందు భక్తుల సందడి

మహానంది: బుక్కాపురం, గాజులపల్లె గ్రామాల్లో గురువారం రాత్రి మౌలాలిస్వామి జార్తాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు మకానానికి చేరుకుని పీర్ల స్వాములను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. జార్తాలు సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది. పీర్ల చావిడిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం



నిరసన తెలుపుతున్న నాయకులు

నందికొట్కూరు: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడంలో తీరని అన్యాయం చేసిందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు ఆరోపించారు. గురువారం స్థానిక కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విభజన చట్టం హామీలను కేంద్రం అమలు చేయకపోవడం దారుణమన్నారు. విశాఖ ఉక్కును ఆదుకోకపోగా గతంకన్నా రూ.632 కోట్లు తగ్గించడం సిగ్గు చేటన్నారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు ఆయా ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన చట్టం అమలుకు కట్టుబడి ఉంటామని చెప్పి బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం, యూనియన్ నాయకులు భాస్కరరెడ్డి, గోపాలకృష్ణ, నాగన్న, కృష్ణ, పాండు, స్వాములు, బాబు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం



వంతెన మధ్యన ఏర్పడిన పెద్ద గుంత



దెబ్బతిని ఒరిగిన వంతెన

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారికోడూరు గ్రామం నుంచి భీమవరానికి వెళ్లేదారి మధ్యలో మద్దిలేరు వంతెన దెబ్బతిని ప్రమాదకరంగా మారిది. వర్షాలకు వంతెన పైభాగంలో గుంతలు ఏర్పడ్డాయి. ఇటుగా రాకపోకలు సాగించే రైతులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదానికి గురవుతామోనని ఆందోళన చెందుతున్నారు. సమస్య పరిష్కారం కోసం గతంలో జిల్లా కలెక్టర్, అధికారులకు కలిసి వినతిపత్రాలను అందించినా పట్టించుకున్న పాపాన పోలేదు. తాజాగా నంద్యాల జిల్లాకు వచ్చిన కలెక్టర్ రాజకుమారికి సైతం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతన మధ్యలో ఉన్న పెద్ద గుంతను పూడ్చాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.